# అడవిగాచిన వెన్నెల

అర్ధరాత్రి దాటింది... అమావాస్య ముందు చీకటి చిక్కగా పరుచుకొనుంది. చెట్లకు గుడ్లగూబలు (గబ్బిలాలు) తలక్రిందులుగావేలాడి అరుస్తున్నాయి - చిమ్మెటల చప్పుడు తప్ప ఊరంతా నిశ్శబ్దంగా ఉంది... ప్రొద్దంతా పని పాటలకు పోయొచ్చిన జనాలు అలసిన శరీరాలతో గాఢ నిద్రలో ఉన్నారు... ప్రశాంతంగా నిద్రపోతున్న ఆ ఊరికి రెండుకిలో మీటర్ల దూరంలో గుట్టుంది... ఆ గుట్టకు దగ్గరగా ఉన్న చెలకలో గొర్రెల మందుంది... ఈత బరిగెలతో చేసిన తడికల మధ్య గొర్రెరువుపై పడుకున్నజీవాలు దోమల బాధ కాగలేక పోతున్నాయి. కొన్ని లేచి తలలు అటూ ఇటూ విదిలిస్తున్నాయి. తడికల్లోంచి ఎరువు వాసన వెగటుగా వస్తుంది. దూరంగా నక్కల ఊళలు వినిపిస్తున్నాయి... గుట్టల మీద నెగళ్లు మండుతున్నాయి... అక్కడక్కడ కొరివి దయ్యాల్లా మంటలు కనబడుతున్నాయి...

మంద చుట్టూ తిరుగుతూ నల్ల కుక్క, తెల్ల మచ్చల కుక్క అప్పుడప్పుడు అరుస్తున్నాయి... వాతావరణమంతా చీకటి చీకటిగా భయంకరంగా ఉంది... ఎముకలు కొరికే మాఘ మాసపు చలి అందర్నీ ముడుచుకు పోయేలా చేస్తూంది. తడికల ప్రక్కనే ఇద్దరు బోయేలు కాళ్లు చేతులు లిఫాపల్లా మలుచుకొని గొంగళ్లు కప్పుకొని పడుకున్నారు...

ఆ చలి తననేం చేయలేదన్నట్టుగా చేతిలో గుతుప కట్టె పట్టుకొని మంద ప్రక్కనో వృద్ధుడు నిల్చొనున్నాడు. అందర్నీ వణికిస్తున్న చలి అరవై ఏళ్లు దాటుతున్న ఆ వృద్ధుడి నేమీ చేయలేక పోతోందేమో... అతని ఒంటిపై చొక్కా లేదు.. పుట్టి బుద్దెరిగి నప్పట్నుంచీ ఒంటిపై చొక్కా వేసుకొనెరుగ డాతను.. అతని మొలకు పైకి మలిచికట్టిన కుప్పునవంచు ధోవతీ ఉంది. తలమీద రుమాలుంది... రుమాలుపై నుండి గొంగడి ముసుగుంది... కాళ్లకు ఒక్కోటి కిలో తూగే తోలు చెప్పులున్నాయి.

మాసిన తల... బుర్ర మీసాలు... కొద్దిగా పెరిగున్న తెల్ల గడ్డం... లోపలకు పోయున్న చెంపలు... ముడతలు పడుతున్న చర్మం... పగుళ్లు బట్టినకాళ్ళు... ఇదీ ఆ వృద్ధుడి ఆకారం.. ఆతని పేరు భూమయ్య... నలుగురు 'శిశువులు పురిట్లోనే చనిపోతే, ఐదవ సంతానమైనా దక్కాలని ఆ పేరుపెట్టా రతని తల్లిదండ్రులు...

గుతుప నేలకానించి చప్పుడు చేస్తూ అటూ ఇటూ నడిచాడు భూమయ్య... చీకట్లోనే జీవాల

దిక్కు చూపాడు...చేత్తో.. 'ఫట్' మని దోమనుచంపాడు...

దోమలు బాగా పాడైనయి... జీవాలను నిద్రపోనిచ్చేటట్టు లేవు... తనలో తానే అనుకున్నాడు...

''అరేకొంరిగా! నిద్ర గిట్ట పొయ్యేవురా...? నడిజాము దాటింది. కలికి గాంధారియాల్లా... గిప్పుడే తోడేల్లత్తయి... మంచిగ సూసుకుంటుండాలె...'' అన్నాడు భూమయ్య.

ఆ మాటలు విన్న ఇరవై ఏళ్ల కొంరయ్య అతని దగ్గర కొచ్చాడు...

''నే నెందుకు నిదురవోత తాత...? నాకు తెలవదా ఏంది...?'' అన్నాడు.

''పెండ్లామ్మీదికి కొట్టుకుంటుందా...? ఓసారి ఇంటికి పొయ్యత్తవా మరి...?'' పరాచికమాడాడు భూమయ్య...

ఆ మాటలకు సిగ్గుపడ్డాడు కొంరయ్య...

''లగ్గమైనెల రోజులన్న కాకపోయె... కుతి కొట్టుకోదా తాత...? కని, నేం బోతె మందుకావలెళ్లు...? నీ ఒక్కన్నుంచైతదా...? ఇంకో జామైతే మనవం తైపోతది... గప్పుడు పొయ్యత్త...'' అన్నాడు..

ఆ మాటలు విన్న భూమయ్య ముఖం చిన్నబోయింది... తన అరవై ఏళ్ల జీవితంకళ్ల ముందు కదిలింది...

''కొత్తగా లగ్గమైనా ఏమైనా రాత్రంతా పెండ్లాంతో నిగడిపే గోల్లెదెక్కడున్నడు మనుమడ...! మన రాతలే గింత...'' అని ''సరెగని పిల్ల మంచి గింటందా...?'' అన్నాడు.

'' ఇనుడేంది తాత? ఆ డొల్ల కే మెరుక? మెల్లె మెల్లెగ బుదురకిచ్చి రేవుకు తెచ్చుకోవాలె...''

'' ఉషారే ఉన్నవు మనుమడ... లగ్గానికి ముందే అన్నీ నేర్చుకున్నట్టున్నవు గద... ఎవ్వల్నేర్పింద్రు...?'' అని నవ్వాడు భూమయ్య.

''గట్లెందు కంటవు తాత? నే నెసొంటోన్నో నీకు తెలవదా?''

''నువ్వు రామునసొంటోనివి... నా కెరుకే... మనుమనివని అట్ల పరాసిక మాడితి... పిల్ల మంచిగుంది... మంచిదాన్నే పట్టినవు...''

''మా నాయన్న అవ్వ, మా మ్యానమామ బిడ్డెను సేసుకొమ్మని పోరు మా పెట్టింద్రు... కని, నే నిల్లే... గిదే కావన్నని పట్టుపట్టిన...''

''ఇయ్యాల్ల రేపటి పొల్లగండ్లు పెద్దోల్ల మాట లినెటట్టున్నరా.... ఆల్లన్నదేకావాలంటరు...''

''నా మనుసుపడ్డ పిల్లం జేసుకుంటె తప్పా తాత...? మా సెల్లె లగ్గంల చూసినకాన్నుంచి గాపిల్ల మీన్నే మనుసుపడ్డది...''

''నువ్వు చేసింది తప్పుంటలేను - మాది ఎడ్డికాలం... ఎట్లనో గడిసింది... మీరన్న మంచిగ బతుకాలె కొడుక...''

'' ఏం మంచిగ బతుకుడు తాత...? గొర్లకాసెటోని బతుకుల సుకమేడుంది...? గీ గబ్బును, వాసనను భరించన్నా..? ఎండల, వానల, చలిల కాలుకు బట్టగట్టకుంట తిరుగన్నా.. అయినా ఎప్పటి చిప్ప ఎనుగుల కన్నట్టు గావట్టె.. ఏం బతుకు దెరువు పాడైంది గిండ్ల...''

అక్కడికి కొంచెం దూరంగా ఎండుటాకుల మీద అడుగులు పడ్తున్న చప్పుడు వినబడింది... మందకాడి కుక్కలు భౌభౌమని మొరిగాయి...

''అగో! తోడేలు వత్తున్నట్టుంది పిలగ... కట్టె చేతుల పట్టుకొని మంద చుట్టోపారి తిరిగిరా

పో...'' అన్నాడు భూమయ్య...

కుక్కలు చప్పుడు వచ్చిన దిక్కు అరుస్తూ పరుగెత్తాయి.. కట్టెలు చేతుల్లో పట్టుకొని వాటి వెనుకే భూమయ్య కొంరయ్య వెళ్లారు...

కొద్ది దూరం వెళ్లి తిరిగొచ్చాయికుక్కలు...

వాటి వెనుకే వాళ్ళిద్దరు తిరిగొచ్చారు...

''తోడేలు పాడుగాను... బాగలువాటైంది... నిద్రపోవద్దు బిడ్డ... జీవాలను కళ్లల్ల వత్తులేసుకొని కాపాడుకోవాలె...''

'' ఓపారచ్చిల్లిపెయిందంటె మల్లేం రాదు తాత...''

''దీన్ని దొంగల్దిన... మోసకారి దది... దాన్ని నమ్మద్దు... నమ్మిచ్చి మందమీద ఫడ్తది...''

''మన వంతాయెదాక మనమెందుకు పంటం...? కని బాగా సలి వెడుతుంది తాత...?''

''తెల్లారంగ మనుమరాలు దగ్గరికి పోదువుగనిగా చెత్తంత జమ జెయ్యి... మంట పెడుదాం...

అక్కడక్కడున్నచెత్త;కంప కట్టె సాయంతో పట్టుకొచ్చి కుప్పగా వేశాడు కొంరయ్య... మంద చుట్టూ ఓసారి తిరిగొచ్చాడు భూమయ్య... ఎక్కన్నుంచైనా చప్పుడొస్తుందేమోనని చెవులు రిక్కించి విన్నాడు... ఎక్కడేం ప్రమాదం లేదన్న నమ్మకం కలిగిం తర్వాత వచ్చి కంప పక్కన కూర్చున్నారు... రుమాల్లోంచి చెకుముకి రాయి. దూది తీసి అగ్గి రాజేశాడు... దాన్నొకంప మీద పెట్టి ''ఫ్ ఉఫ్'' మని ఊదాడు... మంట లేచింది... ''హోయ్... హోయ్...'' అని చేతులు మంట పైకి చాపుతూ కాళ్లు చాపుకొని కూర్చున్నాడు... ''కుంయ్.. కుంయ్'' అని మూలుగుతూ వచ్చి మందకాడి కుక్కలు భూమయ్య ప్రక్కన పడుకున్నాయి... మంట వేడి వెచ్చగా తగులుతుంటే అవిహాయిగా మూలుగుతున్నాయ.

తాత మనుమ లిద్దరు మాటల్లో పడ్డారు...

''గీగొర్లగాసుకుంట బతుకు డెంత కష్టం తాత...? పొద్దుందనుక ఊరి పెద్దోల్లతోని బాధ... ఎవ్వల చేండ్లపడ్డా మీది మీది కురికచ్చిరి... దండుగలని... బంజరు దొడ్లని... రాత్రయితే నేమో దొంగల్తోని, జంతువుల్తోని బాధాయె... పానం కంటెక్వ సూసుకోంది గీ జీవాలు... దక్కుడు కష్టమే...''

''అవు మనుమడ...! నువ్వు గిప్పుడేం జూసినవు...? నువ్వప్పుడింకకట్టెపట్టలే...సందులు వడ్డదంటె దొంగల భయం... కత్తులు సూపెట్టి భయపెట్టి ఎత్తుకపోయెటోల్లు... పొద్దు గూకిందంటె ఎవ్వలకు కంటి మీద కునుకుండకపోవు.. మందకొన్నిగొర్లు పెయినయి... ఇగ గిట్లయితే లాభం లేదని అన్ని మందలు ఒక్కకాన్నేపండుడు వెట్టినం గొల్లోల్లందరం గుతుపలు పట్టుకోని కావలిగాసుడు వెట్టినం... సచ్చేదొరోజు... పుట్టేదో రోజని ధైర్నం జేసినం.. ఓపారి నలుగురచ్చింద్రు... గుతు పలందుకొని ఉతుకుడు పెట్టినం... దొరుకవట్టినం... గిట్ల ఎన్నోసార్లయింది... అప్పుడూరవతల జెంగలు తీరుగుండె.. తోడేల్లు బాగుండె.. చెట్లు గొట్టి జెంగల్ను పాడుజేసింద్రు...''

''గీ దొంగలు సరె.. అల్ల నుంచెట్లనన్న కాపాడచ్చు.. కని ఊల్లున్న రుసూడుతాత... దొరలాకారంతోని... గాల్ల నుంచి తప్పిచ్చుకునుడు.. కష్టమనుకుంట... కదా తాత...?'' అన్నాడు కొంరయ్య...

''చిన్నోనివైనా మంచిగ చెప్పినవుమనుమడ... తోడేల్లుంటే మంచి కుక్కల పెంచి జీవాలను

కాపాడుకోవచ్చు... దొంగలత్తె అందరం మూటిగుండి రచ్చించుకోవచ్చు... కాని దొరల్నుంచి తప్పిచ్చుకునుడు కష్టం... నిజంగా దొంగలాల్లే...''

తలమీదున్నరుమాల్లోంచి మొక్కి చుట్టు తీశాడు భూమయ్య... కట్టె నిపుకతో చుట్టంటు పెట్టుకున్నాడు... గుప్‌గుప్‌మని రెండుబుక్కలు పొగపీల్చాడు.. వొగటు వానొస్తే కాండ్రకించి ఉమ్మేశాడు... మరోనాలుగు బుక్కలు పీల్చి చుట్టనార్పేశాడు...

''గిప్పుడం కొంచెం తావులాలుకచ్చినట్టున్నరుకాని వునుపు గీ దొరలు బాగాసాగిచ్చుకున్నరంట గద! మా నాయన చెప్పంగిన్న...''

''అవు మనుమడ... అప్పుడు గీల్ల పటాటోపం కొద్దిగుండెనా...? గొల్లోల్ల, పనిపాటలోల్ల బతుకులెంత గోరంగుండెనో నీకెట్లజెప్పాలె...? గొర్లగాసెటోన్నందరు ఆరితోరనే పిల్సిరి.. కొంరిగా, నర్సింగా, గంగా అనేపిల్సిరి కని పేరు పెట్టి పిలవకపోయిరి... మా బట్టగట్టుడు సూచి వొగ్గెలవెట్టిరి.. మామోటు మాట్లాడుడు జూసి పేర్వాల వెట్టిరి... బస్సెక్కుతంటె గొంగడి తాకుతుందని తిట్టిరి... ఏం జెయ్యాలె మనుమడ... మనమంటె అందరికీ పరాశికాలేనాయె...!

''అందరి కాపి, పైసలిచ్చినోనికి కూడాపి దొరలు సెప్పింద్రంటే మందలు వెట్టన్నాయె... పైసలడుగుతే నేమో కొట్టకొట్టచ్చిరి... తప్పిపోయి ఓ గొర్రె చేండ్లవడ్డదనుకో... నూర్లకు నూర్లు దండుగలు గుంజిరి... పంచాయితిలన్ని... మన్నని.. మసానమన్నిగా రంపాట్లాలన్నే మెరుక...? అల్లు దండుగలు గట్టుమంటె కట్టెటోల్లం... ఆల్లనుకోనాయ నెటోల్లెవ్వలు..? ఆల్లేరాజులైరి... ఆల్లేమంత్రులైరి... ఆల్లే పంచాయతీ పెద్దలైరి... ఆల్లన్నట్టు నడ్సింది...'' అని ఆగాడు భూమయ్య... ఏదో చప్పుడైనట్లనిపిస్తే పరీక్షగా విన్నాడు... ఏం లేదని నిర్ధారణ చేసుకుని సంతృప్తిపడ్డాడు.

చలిగాలి సుయ్‌మని గువ్వలను తాకుతూంది. తడికల మధ్య గొర్రెలన్నిమలుచుకుని పడుకున్నాయి. కొన్ని నిలుచుని వేరే గొర్రెలకు మూతులురాస్తున్నాయి...

''తాతా! నేను పదేండ్లవట్టిగొర్ల కాత్తన్న... నాసిన్నప్పుడు గప్పట్లోసారి మన పొలుమార్ల గొర్ల మేపుతున్నం వేలెడంత లేడు.. రెడ్డోల్ల పిల్లగాడు నీ మీది కురికురికచ్చె... బూతులు దిట్టె... ఆరుగట్టెవట్టికొడుతుంటె నువ్వు సప్పుడు జేకనే ఊకుంటివి... ఆల్లకు గంత పొగరెందుకు తాత...? నాకైతే మస్తుమంటచ్చింది కని నువ్వే ఊకుంటేనేనేం జెయ్యన్నని ఓపికపట్టిన...''

దాదాపు పదేళ్ళ క్రింద జరిగిన విషయాన్ని జ్ఞాపకం చేసుకున్నాడు భూమయ్య... అవమాన భారంతో ఆతని మనసు బరువైంది...

''ఏంజేసుడు కొడక! వాళ్లు గట్ల సాగిచ్చుకున్నరు... వాళ్లు మన పక్కూరురెడ్లు... నేను జాగ్రర్తగ చూసుకుంటనే ఉన్న... ఓ దొంగగొర్రె ఉరికిపొయ్యి ఆల్ల పెసరు చేండ్ల పడ్డది... నేను జెప్పన్నే పొయ్యి మర్లేసుకొచ్చిన... సూడనే సూసిండాపోరడు... బూతులు దిట్టుకుంటూకట్టెతోని కొట్టనే వట్టె...

''అప్పుడాల్లు ఊళ్లో మస్తు సాగిచ్చుకున్నరు... బీళ్ళున్నా వాళ్ల చేను, చెలుకలల్ల గొడ్డు గోద, గొర్రెమ్యాక తిరుగద్దు... వాళ్ళ భూములల్ల ఎవ్వలు పెండ పిడుక ఏరుకోవద్దు... ఎవ్వలన్న మర్సిపోయి ఆల్ల చేండ్ల కందికాయె, పెసరుకాయో ముట్టింద్రనుకో... పందిరి గుంజకు కట్టేసి కొట్టింద్రు... నూర్ల కొద్ది దండుగలు పెట్టింద్రు... వాళ్లు కోసిన పొలం కొయ్యకాల్ల గొర్రెమ్యాక మేసినా మందలు పెట్టాలె.. వాళ్ల పటాటోపం చెపుతే ఒడువది కొడుక... అగో... తూర్పుదిక్కేమో చప్పుడైంతంది విను... ఓసారి

పొయ్యి చూసిరా పో...'' అన్నాడు భూమయ్య...

కొంరయ్య లేచి కట్టె చేతిలో పట్టుకుని అటు దిక్కుకు వెళ్లాడు... అతన్తో పాటు కుక్క కూడా వెళ్లింది...''చో... ఛో...'' అంటూ కట్టెతో భూమ్మీద కొడుతూ కొద్ది దూరం వెళ్లి తిరిగొచ్చాడు.

'' లేదు తాత... నక్కున్నట్టుంది... పొదల్నుం చురికింది గా నక్కతో నేమైద్ది...?'' అని నిపుకల దగ్గర కూర్చున్నాడు...

''తాత మీరు కష్టాలు, సుఖాలన్నీ జూసిండ్రు...''

''కరువు జూసినం... కాలం జూసినం... ఎన్నో ఎల్లవోసినం కొడుక... కరువత్తేం దొరుకక చింత సిగురేరుక తిన్న కాలం గూడుంది.. మునుపు గత్త రచ్చిందంటే ఊళ్లకూళ్లే తన్నుకు పొయ్యేటియి... ఓ దిక్కు కరువు, కాలంతోని బాధలంటె ఊళ్లో అందరికీ ఎట్టి గొర్లిచ్చుడాయె... పోలీసుపటేలు, మాలిపటేలు, సర్పంచ్, పట్వారి, ఊరిదొర ఎవ్వరింట్ల శుభకార్యమైనా గొర్లనట్టిగనే ఇయ్యాలె... వానాకాలం ముంగట ఊరి మీద పోసమ్మకు సేత్తె వెట్టి గొర్లిచ్చుడేనాయె... నైజాం కాలంల తాసీల్దారు గిట్లత్తె ఎట్టిగొర్లే... ఊళ్లకు బస్సుపడ్డా అర్టీసోల్లను దసుర దసురకు గొర్రెనిచ్చుడు మొన్నటాకుండె...

''పొద్దంత చెట్టనక, గుట్టనక... తిరిగి తిరిగి మేపుకొని, పురుగ్గొట్టకుంట సాదుకుంటె పెద్దోల్లు వెట్టి కిందెన్నో జీవాలను దొబ్బిపెయిరి... ఎండల, వానల, చలిల పెయ్యి మీద బట్ట పేలికన్న లేకుంట రాయనక, రప్పనక గొర్రె మ్యాకెంబడి తిరిగితిమి... అవ్వి ఉరుకుతె ఉరుకున్నాయె... నడిత్తె నడువన్నాయె... అగుతె ఆగన్నాయె... వాటెంబడి తిరుక్కుంట ఎండల ఎండితిమి... వానల నానితిమి.. చలిల వణికితిమి... ఇన్ని జేత్తే ఏమచ్చె...? ఆయుటిబూనంగ సిటుకు రోగమత్తె బొంత పురుగుల లెక్కనే ఫట్‌ఫట్‌మని సచ్చె... ఓసారోసారి సగం మందకొక్కనే ఊడ్సుకపోయె... అందరితోని అవుమానాలయె... ఎంత జేసినా ఒక్కనాడన్న కాయిపాయిగ తిన్నది లేపాయె... కంటినిండ నిద్దుర పెయింది లేపాయె... గడె గడుకంబలి, గొర్రెచల్లనా సిన్నప్పటి కెల్లి తాగుతన్న...

''నడ్డికి దొడ్డు ధోతి, గొంగడి ముసుగు, నెత్తికి రుమాలు, చేతుల గుతుపకట్టె గివ్వే మిగుల్తున్నయి మనకు...నాకొడుకు సంగతట్టిడిసి పెడితే.. మనుమన్నన్న నదివియ్యాన్ననుకుంటే వీలుగాకపాయె... ఐదోట్లనే బందుజేసుడాయె... గిది మన గొల్లోల్ల బతుకు కొడుకా... నా చిన్నప్పట్నుంచి గట్లనే ఉంది...''

గొల్ల కథ చెప్పినట్లుగా చెప్పుకొచ్చాడు భూమయ్య...

''అవు తాతనేం జూత్తలేనా...? గందుకే సానుంది గీ పనిడిసిపెట్టి బాయిపనికో, ఇంకేమన్నాపనికో పోవన్నని సూత్తండ్రు... కొందరు బతుకుటానికి పట్నాలకు పోతండ్రు.. నేం గూడ బాయి పనికి పోవాలనుకుంటున్న తాత...?''

''పోండ్రి బిడ్డ.. అందరూ పోండ్రి.. మా ముసలోల్ల నిడిసిపెట్టి అందరెల్లిపోండ్రి. కుక్కలల్లపడి మేంజత్తం... అయినా ఇయ్యాల్లరేపటి పోరగాండ్లు ముసలోల్లను పట్టిచ్చుకునెటట్టున్నరా...? ఇప్పుడు కుల వృత్తినెవ్వలు జేత్తండ్రు...? నా ఆసోంటి ముసలోల్లు కులకసిపనిపట్టుకోని ఏలాడుతండ్రు.. పడుసు పోరగాండ్లంత ఊళ్లిడిసి పోతండ్రు... గక్కడేమో సుకపడ్త ననుకుంటండ్రేమో.. ఎక్కడికి పోయినా ఏడేమాస్కలు...కడుప లోపలున్న సుకం కశికి పోయినా దొరుకది...'' నిస్సహాంగా, నిష్ఠురంగా, ఆవేదనగా అన్నాడు భూమయ్య.

తాత మాట తీరు మారడం గమనించిన కొంరయ్య మాట మార్చాడు... కొంతసేపు

పరాచికాలాడాడు...

''అవు తాత... వెనుకటి దేశ్‌ముఖ్ పెద్దగొల్లకు దసుర దసురకు కట్నాలు పెట్టెటోడంట కద తాత...? గిది నిజమేనా?' అన్నాడు.

''ఆం... పెట్టెటోడు తియ్యి... ఆయనేసొమ్ము పెట్టెటోడా...? అన్నింటికీ ఎట్టి గొర్లిత్తె - దసురదసురకు పెద్ద గొల్లనుపిలిసి ఓ రుమాలు, అంగి, ధోతి ఇచ్చి, భోజనం పెట్టి ఎల్లగొట్టెటోడు.. దాంతోనే ఉబ్బిపోయెటోల్లు...'' అన్నాడు భూమయ్య..

''తాత... ఎవ్వలకు లేని దేవుళ్లు మనకే ఉన్నాయ్.. నడింట్ల మల్లన్న... అర్రల లచ్చిందేవి... ఇంటెముకమైసమ్మ.. పక్కలకు పోసమ్మ... ఇవన్నిటినీ కొలుసుకోటానికే మస్తు ఖర్సాయె.. పట్నాలప్పుడైతే వెయిలు ఖర్సాయె.. మనకెల్లకనే పాయె గివ్వన్ని సెయ్యకుంటేంది తాత...?''

''గొర్ల గాసెటోల్లు గొర్లసొంటి అమాయకులు.. అల్లకు దేవుల్ల మీన నమ్మకాలెక్కువ... ఎల్లుమానుండాలెగాని దేవుళ్లను కొలిత్తె బీదోల్లమైతమా బిడ్డ'' అని లేచి ఆకాశం దిక్కు చూశాడు భూమయ్య... గోరుకొయ్య చుక్కలు వంగుతున్నాయి.

'' ఇయ్యాల్లేంది మనుగడ... కథ జెప్పుమంటె ఎతంత జెప్పినట్టయింది... పొద్దే తెలువలే. మన జాం గాసుడైపోయింది... అల్లిదర్నీ లేపి నువ్వింటికి పో... ఓపారి మందసుట్టు తిరగత్తాం పొ'' అని కొంరయ్యతోపాటు చుట్టూ తిరుగుతున్నాడు భూమయ్య...

గువ్వలను తాకుతూ చల్లగా గాలి వీస్తుంది... చెవుల నిండుగా గొంగడి ముసుగేసుకున్నాడు..

ఆ ప్రదేశమంతా నిశ్శబ్దంగా ఉంది.. సమీపంలో ఉన్న గుట్టపై ఏదో మండుతున్నట్టుంది... ఏదైనా అలికిడి అయితే తేపకోసారి కుక్కలు మొరుగుతున్నాయి.. దూరంగా ఉన్న మరో మంద దగ్గర నెగల్లు మండుతున్నాయి.

మరికొద్ది సేపట్లో వాళ్ల వంతు అయిపోయింది... భూమయ్య కొంరయ్య పడుకున్న బోయేలిద్దర్నీ లేపారు. మూలుగుతూ, మబ్బు విరుస్తూ గొంగడి ముసుగులేసుకొని లేచి నిలుచున్నారు వాళ్లు.

''నువ్వు పో మనుమడ... ఇంటికి పొయ్యిమనుమరాలు సంగతి చూసుకో పో...'' అన్నాడు భూమయ్య కొంరయ్య నుద్దేశించి...

కొంరయ్య సిగ్గుపడుతూ మెలికలు తిరిగాడు...

''గల్లపోతే మన్నట్టు...'' అన్నాడు లింగయ్య..

''పోనియ్యలేవు... కొత్తగా లగ్గం జేసుకున్నాడు... తెల్లారంగ పాలు పిండుకపోవడానికి మా వత్తడు... ఏమన్నక్కెరుంటె నన్ను లేవుంర్రి...''

భూమయ్య అనేసరికి సరేనని కట్టెలు చేతుల్లోకి తీసుకున్నారు వాళ్లిద్దరూ...

''పోతన్న తాతా...?'' అంటూ కొంరయ్య గొంగడి ముసుగు సర్దుకుని ఊరి దిక్కు బయలుదేరాడు..

''మెల్లగా పో... అమాస చీకటి.. పురుగు బుసుంటుంది...'' వెనుక నుంచి హెచ్చరించాడు భూమయ్య...

''పైలం.. అప్పుడో సారచ్చింది తోడేలు.. మల్లరాజిక్క...'' మందకావలుండే వాళ్లను హెచ్చరించి అక్కడే నేలపై పడుకున్నాడు భూమయ్య...

చల్లగా గాలి వీస్తోంది... ఎంత ప్రయత్నించినా నిద్ర పట్టడం లేదు... ఇంత వరకు కొంరయ్యతో మాట్లాడిన మాటలు జ్ఞాపకం వచ్చి గొర్రెల కాపరిగా యాభై ఏళ్ల జీవితం అతని కళ్ల ముందు కదులుతుంది...

తను బుద్దెరిగినప్పట్నుంచీ గొర్రెల కాపరిగానే బ్రతుకుతున్నాడు... గొర్రెల కాపరిగా ఎన్నో అవమానాలను పొందాడు... ఊరి పెద్దలతో తిట్లను తిన్నాడు.. దెబ్బలు తిన్నాడు...

తనగొర్రెలను మేపడానికొరకు చెట్లెక్కి తుమ్మకాయ కొట్టాడు.. కొమ్మలు తెంపేశాడు... గుట్టలెక్కి మేపాడు... ఒర్రెలు, వాగులు, వంతలు అన్నీ తిరిగాడు.. అన్ని కాలాల్లోనూ కష్టపడ్డాడు...

మునుపు గొర్రెమ్యాక తిరగడానికి కావలసినంత పోరంబోకు భూముండేది.. ఊరుమ్మడి సొత్తుగా గుట్టలుండేవి... కాని, ఆ భూములను కొంత దొరలాక్రమించుకున్నారు... గ్రామ పొలిమేరల్లోని భూముల్లో కొందరిండ్లు కట్టుకున్నారు... మొత్తం మీద అందరూ కలిసి ఊళ్లో పరంపోగు భూములు లేకుండా చేశారు.

తుదకు గుట్టల్లోని కొంత భాగాన్ని కూడా దొరలే స్వాధీనం చేసుకున్నారు... గొర్రెమ్యాక, గొడ్డూ గోదా తిరగడానికి భూముల్లేకుండా అయిపోయాయి. అందువల్ల గొర్లమందలు మేపడానికి చాలా తిరగాల్సి వస్తుంది. అవికడుపునిండా మేయాలంటే పొద్దంతా తిరగాల్సొస్తుంది... నడిచే తోవలు ఇరుకయ్యాయి... తోవల్నిండా బురద...

దొరలతో పడ్డ అవమానాలు ప్రభుత్వోద్యోగులతో పడ్డ అవమానాలు తన ఇన్నేళ్ల కష్టమయమైన జీవితాన్నంతా మననం చేసుకుంటున్నాడు భూమయ్య...

ఇంటికెళ్లిన కొంరయ్య జ్ఞాపకం వచ్చాడు...

తాను, తన కొడుకు, మనుమలు, తన వృత్తి వాళ్లంతా అంతే!...కొత్తగా పెళ్లయినా భార్యతో రాత్రంతా గడిపే అవకాశం లేదు... తమ యవ్వనమంతా అలాగే గడిచిపోయింది... పోతుంది...

తమ బ్రతుకులన్నీ అడవిగాచిన వెన్నెలలే అయ్యాయి... తమ కష్టమయ జీవితంలో వెన్నెలలే కరువయ్యాయి.

''అడవిగాచిన వెన్నెల్లాంటి తమ బ్రతుకులు అడవిలో వెన్నెలలా మారితే బాగుండును'' అనుకున్నాడు భూమయ్య...

గత కొద్ది కాలంలో తనలాంటి వాళ్ల మీద ఊరి పెద్దల అధికారం తగ్గడం.. పెద్దవాళ్లాక్రమించుకున్న ఊరుమ్మడి సొత్తు భూములు మళ్లీ ఊరి పరం కావడం చూస్తుంటే భూమయ్యకు భవిష్యత్తు కొంత ఆశాజనకంగానే కనబడుతోంది...

''తమ అడవిగాచిన వెన్నెల బ్రతుకులు అడవిలో వెన్నెలలా మారుతాయి...''

తనలో తానే గొణుక్కున్నట్లనుకుంటూ తెల్లవారు జామున నిద్రలో కొరిగాడు భూమయ్య...

*ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 1-7, సెప్టెంబర్ 92*

''ఇంకా నా ఇకపై సాగదు'' కథా సంకలనం నుంచి...